గొప్ప ఆలోచనలకు నాంది పలకండి

గూగుల్ కంపెనీ మాజీ అధికారి కిరణ్ బాబు

సిటీబ్యూరో, ఏప్రిల్04, (నమస్తే తెలంగాణ):దేశ ఆర్థిక పురోగతికోసం ప్రతి ఒక్కరూ గొప్ప ఆలోచనలకు నాంది పలకాలని గూగుల్ కంపెనీ మాజీ అధికారి కిరణ్ బాబు తెలిపారు. జంటనగరాల్లోని పలు కళాశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులను నిర్వహిస్తున్న గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 3వ స్కిల్ స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ బాబు మాట్లాడారు. అనంతరం 107 మంది విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సెయింట్ జోసెఫ్ పీజీ అండ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు దృవపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారుల్లో ఒకరైన డాక్టర్ ఆర్. హఫీజ్ భాషా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పాత వాటికే కొత్త పూతలు

- హెచ్ఆర్‌డీసీఎల్ ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ హయాంలోనివే..
- ఐదు ప్యాకేజీలుగా లింకు రోడ్లు నిర్మించేందుకు గతంలోనే ఉత్తర్వులు
- తాజాగా మూడు ప్యాకేజీలుగా రూ.1500 కోట్లకు టెండర్లు పిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ): పాత దానికి కొత్త పూతలు వేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరితేరింది. ఇప్పటి వరకు చేపట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల విషయంలో ఇదే తీరుగా వ్యవహరిస్తున్నది. తాజాగా హైదరాబాద్ నగరం నుంచి శివారు ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ చేసిన లింకు రోడ్ల అనుసంధానం ప్రాజెక్టును మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తెరమీదకు తీసుకువచ్చింది. అని వార్య కారణాలతో గతంలో రూపొందించిన ప్రణాళికలు కార్యరూపంలోకి రాకుండా నిలిచిపోయాయి. అయితే అవే పనులను కొత్త ప్యాకేజీలుగా చూపుతూ హైదరాబాద్ రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రణాళికలు రూపొందించింది.

హైదరాబాద్ నగరంలో మెరుగైన మౌలిక వసతులు, రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లోనే లింకు రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, ఆధునీకరణపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో కోర్ సిటీ నుంచి అవుటర్ రింగు రోడ్డు దాటి రోడ్లను విస్తరించేలా రూ. 1500 కోట్లతో లింకు రోడ్ల నిర్మాణానికి జీవో. నెం.510 ద్వారా ఆదేశాలు జారీ చేసింది. ఈ పనులను హెచ్ఆర్‌డీసీఎల్ ద్వారా చేపట్టేలా సూచనలు చేసింది. అయితే ఎన్నికలు, లింకు రోడ్లకు అనువైన ప్రాంతాల గుర్తింపు, ప్రతిపాదిత ప్రాంతాల వారీగా హెచ్ఎండీఏ, హెచ్ఆర్‌డీసీఎల్ నగరంలో లింకు రోడ్లకు శ్రీకారం చుట్టింది.

ఈ క్రమంలో వచ్చిన కొన్ని సాంకేతిక సమస్యల నేపథ్యంలో పనులు ఆగిపోతే... వాటికే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పూత వేసి కొత్తగా టెండర్లను పిలిచి నగరంలో లింకు రోడ్లను నిర్మించిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందనే రేంజ్‌లో ప్రచారం చేసుకుంటున్నది.

పాత ప్రతిపాదనలే..

నగరంలో 50 లింకు రోడ్లను నిర్మించేందుకు 2022 సంవత్సరం జూలై నెలలోనే ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ఐదు ప్యాకేజీలుగా పనులు విభజించిన ప్రభుత్వం మొదటి ప్యాకేజీలో రూ.304 కోట్లు, ప్యాకేజీ-2కు రూ.330 కోట్లు, ప్యాకేజీ-3కి రూ. 417 కోట్లు, ప్యాకేజీ-4కి రూ. 297 కోట్లు, ప్యాకేజీ-5కి రూ.152 కోట్లతో పనులను చేపట్టేలా ప్రణాళికలు రూపొందించింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత పాత ప్రణాళికలను ముందర వేసుకుని, రంగులు అద్దే ప్రయత్నాలకు తెరలేపింది. ఈ క్రమంలో తొలుత హెచ్ఎండీఏ ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును తెరమీదకు తీసుకువచ్చింది. అప్పటికే భూసేకరణపై కేంద్రంతో బీఆర్ఎస్ చేసిన చర్చలతో భూ బదలాయింపునకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఎన్నికల తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే.. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లకు తుది ఉత్తర్వులు వచ్చాయి. దీనికే కేంద్రం నుంచి భూములు తెచ్చిందే తామే నంటూ అట్టహాసంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన్ అయితే చేశారు. కానీ ఇప్పటికీ ప్రైవేటు వ్యక్తుల నుంచి అడుగు జాగాను కూడా రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల కోసం సేకరించలేకపోయారు. అదేతీరుగా నగరంలో లింకు రోడ్ల నిర్మాణానికి రూపొందించిన ప్రణాళికలను తెరమీదకు తెచ్చిన ప్రభుత్వం... రెండు ప్యాకేజీలుగా 49 ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణానికి కసరత్తు మొదలుపెట్టింది. మూడో దశ లింకు రోడ్ల నిర్మాణంలో భాగంగా రెండు ప్యాకేజీలుగా విడగొట్టి 49 ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు సాగుతుండగా, మరికొన్ని మార్గాలకు టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వం మాత్రం నగరంలో లింకు రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లుగా చెప్పుకొంటున్నది.

ఎల్బీనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు

మధుయాష్కీ ఓ టూరిస్ట్ లీడర్..

ఎల్బీనగర్ నియోజకవర్గంపై అవగాహన లేదు..

ప్రొటోకాల్ రగడకు కారణం కాంగ్రెస్ బీజేపీల సఖ్యతే

ఎక్కడ నిర్మాణం చేపట్టినా వసూళ్ల కోసం బీజేపీ వాళ్లు వాలిపోతున్నారు: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 4: మధుయాష్కీ ఓ టూరిస్ట్ లీడడని, కొన్ని రోజులు డిల్లీలో, కొన్ని రోజులు అమెరికాలో ఉండి కొన్ని రోజుల కోసం ఎల్బీనగర్‌లో రాజకీయాలు చేస్తారని, నియోజకవర్గంపై అవగాహన లేకుండా మాట్లాడుతారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. కొత్తపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్‌రెడ్డి కార్పొరేటర్లతో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, భవాని ప్రవీణ్‌కుమార్, రమావత్ పద్మానాయక్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డిన గర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయన ఈ సమావేశంలో ఇంకా ఏమన్నారంటే.. 'మధుయాష్కీ అడపాదడపా వచ్చే టూరిస్టు నాయకుడు. అంతే తప్ప ఆయనది ప్రజా సేవ కాదు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు తాను ప్రారంభోత్సవాలు చేయెద్దనే నెపంతోనే మధుయాష్కీ గౌడ్ ఇన్‌చార్జి మంత్రి చేత ప్రారంభోత్సవాలు చేయిస్తానంటూ మాట్లాడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని అన్నింట్లో ప్రారంభోత్సవాలకు మంత్రి శ్రీధర్ బాబు పర్యటించి ప్రారంభోత్సవాలకు వస్తారా?

చిన్న చిన్న పార్కులు కూడా..

మధుయాష్కీకి నియోజకవర్గంపై అవగాహన లేదు. చిన్న పార్కులు పూర్తయినా కూడా వాటిని ప్రారంభించకుండా తాళాలు వేసి పెట్టడాన్ని మేం ప్రశ్నించినందుకే కాలయాపన చేస్తున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొందరు నాయకులు, కొందరు కార్పొరేటర్లు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభోత్సవాలు చేయొద్దన్న ఉద్దేశంతో ఉన్నారు. గత కొన్ని రోజుల పాటు నేను అనారోగ్యంతో నియోజకవర్గానికి దూరంగా ఉండటంతోనే ఈ డ్రామాలు ఆరంభం అయ్యాయి. నేను ఏ ఒక్క ప్రారంభోత్సవం చేయకుండా చిన్న చిన్న వాటిని కూడా ఇన్‌చార్జి మంత్రితో ప్రారంభింపజేయాలన్నది వారి ఉద్దేశం.

ప్రోటోకాల్ రగడకు కాంగ్రెస్, బీజేపీల అక్రమ కలయికే కారణం

ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల అక్రమ కలయికే ప్రోటోకాల్ రగడకు కారణం. గతంలో ఏనాడైనా కార్పొరేటర్లు లేకుండా శంకుస్థాపనలుగానీ, ప్రారంభోత్సవాలు గానీ చేశామా? జీహెచ్ఎంసీ నిధులే కాకుండా హెచ్ఎండీఏ, జలమండలి నిధులు నేనే మంజూరు చేయించాను. అయినా సరే కార్పొరేటర్లతో కలిసి ప్రారంభోత్సవాలు చేశాం. అప్పుడు లేని ప్రొటోకాల్ కార్పొరేటర్లకు ఇప్పుడెందుకు వస్తున్నది? నాకు శిలాఫలకాల షోకు లేదు. అందుకే అర్భాటం, అట్టహాసం లేకుండా కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తాను. శిలాఫలకాల షోకు ఉన్నందునే మధుయాష్కీకిఇలా చేస్తున్నాడు.

ఎక్కువ నిధులు తెచ్చాడని నిరూపిస్తే రాజీనామా చేస్తా

ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధే జరుగలేదని, తాను ఈ ఏడాది కాలంలో ఎక్కువ నిధులు తెచ్చానని మధుయాష్కీ గౌడ్ అంటున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తెప్పించి తన కన్న ఏ ఏడాది లోనైనా ఆయన ఎక్కువ నిధులు తెచ్చినట్లుగా నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా. నేను ప్రతిరోజూ మానిటరింగ్ చేయడం వల్లే ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఫ్లై ఓవర్లు త్వరితగతిన పూర్తయ్యాయి.

నిజామాబాద్ నుంచి దిగుమతి అయ్యాడు

నా గురించి మాట్లాడేటప్పుడు మధుయాష్కీ నోరు హద్దులో పెట్టుకుంటే మంచిది. చిల్లర రాజకీయాలు మానుకోవాలి. నాకు స్కూటర్ ఉన్నప్పుడు సుధీర్‌రెడ్డి ఎక్కడున్నాడంటూ మధుయాష్కీ అన్నారు. 1985 లో నాకు డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే స్కూటర్ ఉంది. 1986లోనే నేను జీహెచ్ఎంసీ కార్పొరేటర్ అయ్యాను.1987లోనే అమెరికా వెళ్లాను. మా బంధువులు అప్పటికే అమెరికాలో ఉన్నారు. నేను ఆయన లాగా దొంగ వీసాలు ముద్రించి అమెరికా వెళ్లలేదు. రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా విజయం సాధించా. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండు పర్యాయాలు గెలిచి ప్రజా సేవలో ఉన్నా. 2004లో ఎంట్రీ ఇచ్చి డబ్బిచి టిక్కెట్టు కొనుగోలు చేసి నిజామాబాద్‌లో గెల్సిన తర్వాత అక్కడ సేవ చేయకుండా ఇక్కడికి దిగుమతి అయిన నాయకుడు నన్ను విమర్శించడం ఏమిటి?

పునాదులు తవ్వగానే బీజేపీ వాళ్లు వాలిపోతున్నారు

అక్రమంగా సంపాదించానంటూ కొందరు బీజేపీ నాయకులు ఉదరగొడుతున్నారు. వారికి దమ్ముంటే కేంద్రంలో అధికారంలో ఉన్న వారి ప్రభుత్వంతోనే విచారణ జరిపించి నిరూపించండి. నేను ఎల్బీనగర్‌లో ఏ ఒక్క కాంట్రాక్టర్, బిల్డర్ వద్ద ఒక్క రూపాయి తీసుకోలేదు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎక్కడ ఏ నిర్మాణం జరిగినా, పునాది తవ్వినా బీజేపీ వాళ్లు నిమిషాల్లు వాలిపోయి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

భీమలో మెరిసిపోయే స్వర్ణాభరణాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ ఆభరణాల సంస్థ భీమ విభిన్న రకాల డిజైన్‌లతో మహిళలందరినీ ఆకట్టుకునేలా సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా భీమ జువెల్స్ బ్రాండ్ అంబాసిడర్, హీరో రామ్ చరణ్ శుక్రవారం భీమ జువెల్స్'బంగారం అంటే భీమ' ప్రచారాన్ని ప్రారంభించారు. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయలు బంగారంతో కూడిన వేడుకలతో అంగరంగ వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. హారం, వడ్డాణం, గుట్టపూసలు, చొకర్స్, నక్షిబ్యాంగిల్స్, ఇంట్రికేట్ జుంకాస్ తదితర వెరైటీలను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భీమ జువెల్స్ ఎండీ అభిషేక్ బిందుమాధవ్ మాట్లాడుతూ.. నిజాయితీ, నమ్మకం, విలువలపైనే భీమ కొనసాగుతుందని చెప్పారు.

థాంక్స్ కేటీఆర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమి వివాదంపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞత సభ నిర్వహించారు.

ప్రెస్‌క్లబ్ డైరీ ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 4 : ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ 2025 నూతన సంవత్సరం డైరీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌కు ప్రస్తుత స్థలం కేటాయించాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. వేణుగోపాల నాయుడు, ఆర్. రవికాంత్ రెడ్డిలు మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు. తప్పకుండా జర్నలిస్టులకు తమ ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనంతరం మంత్రి భట్టిని ప్రెస్‌క్లబ్ కార్యవర్గం పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు కె. శ్రీకాంత్ రావు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు బ్రహ్మాండబేరి గోపరాజు, వి. బాపురావు, టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి భట్టి, చిత్రంలో వేణుగోపాల్, రవికాంత్ రెడ్డి, బాపూరావు

219 కోట ట్రైకార్ రుణాలు.. వెంటనే విడుదల చేయండి

ఏప్రిల్ 7న చలో గిరిజన సంక్షేమ భవన్

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 -ట్రైకార్ లో 2019-21 సంవత్సరాల్లో మంజూరై చెక్కులు సిద్ధంచేసి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడని లబ్ధిదారులు ఏప్రిల్ 7 న హైదరాబాదులోని గిరిజన సంక్షేమ భవన్ ముందు జరిగే నిరసన కార్యక్రమానికి లబ్ధిదారులు తరలిరావాలని గిరిజన సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్,తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్ లు మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్రప్రభుత్వం హడావిడిగా ప్రారంభించడం వలన ట్రైకార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందనే అనుమానాలు కలుగుతున్నా యన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 సంవత్సరాల్లో గిరిజన యువతి యువకుల నుండి వేలాది దరఖాస్తులను స్వీకరించి అందులోనుండి 30 వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్దిదారులుగా గుర్తించిందన్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి 219 కోట్ల రూపాయల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామని హామీ ఇవ్వడంతో లబ్దిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు.30 వేల మంది గిరిజన యువతీ యువకులకు రుణాలను మంజూరు చేసి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా రద్దు చేయాలనే కుట్రలు చేస్తోందని ఆరోపించాయి. ప్రభుత్వం లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడం లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన కలుగుతోందని అన్నారు.వీరందరూ రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కొరకు కొత్తగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తూ ఆన్ లైన్ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని ఆరోపించారు.దీనితో వేలాది మంది గిరిజన యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మంది యువతకు రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పతకాన్ని ప్రారంభించింది. గత 50 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైకార్ సమస్త ద్వారా గిరిజన యువతి యువకులకు రుణాలు మంజూరు చేస్తున్నారని అటువంటి ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేయడానికే రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 219 కోట్ల రుణాలను తక్షణం విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకపోతే ఏప్రిల్ 7 న చలో గిరిజన సంక్షేమ భవన్ ముందు శాంతి యుతంగా నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

న్యూఢిల్లీ సదస్సులో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

రవీంద్రభారతి,ఏప్రిల్ 4: బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంఘాల నాయకులు, వేర్వేరు రాష్ట్రాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పై మేధోమథనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, బీసీ మేధావుల ఫోరం, ఛాత్ర ఆర్జేడీ, స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద్రావిడయన్స్, రిజర్వేషన్ క్లబ్ జెఎన్‌యు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఈ సదస్సులో మాట్లాడుతూ బీసీలు రాజకీయ శక్తిని అక్రమించి, సామాజిక న్యాయాన్ని సాధించడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం విద్యా,ఉద్యోగ,రాజకీయ రిజర్వేషన్లు ఇవాల్సిందేనన్నారు.. రాజ్యసభ ఎంపీ పి.విల్సన్ మాట్లాడుతూ బీహార్,తెలంగాణ రాష్ట్రాలలో రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పార్టీలు , సంఘాలు కృషిచేయాలన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆళ్ల రామకృష్ణ, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, మహేష్ రితు, రాకేష్, అక్షన్ రంజన్, ఛాత్ర ఆర్జేడీ, పంకజ్ కుష్వాహా పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఆళ్ల రామకృష్ణ, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

సిటీబ్యూరో, ఏప్రిల్4, (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 11న నిర్వహించే మెగా రక్త శిబిరాన్ని జయప్రదం చేయాలని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం. హుసేని ముజీబ్ పిలుపునిచ్చారు. నాంపల్లిలోని గృహకల్పలో నిర్వహించే ఈ కార్యక్రమంలో రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. శుక్రవారం మెగా రక్తదాన శిబిర కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఈఎన్‌టీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందాచార్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అనిల్ కుమార్, టీఎన్‌జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్, ఈఎన్టీ యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రవి పాల్గొన్నారు.

డ్రోన్ డెవలప్‌మెంట్ పోటీల్లో.. ఎంఎల్ ఆర్ఐటీ జయకేతనం

అభినందన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థులు

దుండిగల్ ,ఏప్రిల్ 4: దుండిగల్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల విద్యార్థులు డ్రోన్ డెవలప్మెంట్ పోటీలలో సత్తా చాటారు. ఎస్ ఏ ఈ ఇండియా సదరన్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఈ పోటీలలోఎంఎల్ ఆర్ఐటీ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో పోటీపడి ద్వితీయ స్థానంలో నిలిచారు. రెగ్యులర్ కేటగిరిలో టిఎన్ఎండి యశస్వి నాయకత్వంలో జటాయు బృందం ద్వితీయ స్థానంలో నిలిచి, రూ45 వేల బహుమతిని గెలుచుకుంది. మైక్రో కేటగిరీలో ఐలా వినయ్ తేజ నాయకత్వంలో టీం అయోలస్ ఏరో డైనమిక్ విశ్లేషణలో ద్వితీయ బహుమతి సొంతం చేసుకుంది .కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ లో ప్రదర్శించిన నిర్వహణ ప్రశంసలు అందుకుంది. కీర్తన నాయకత్వంలో టీం అస్ట్రా, సంకలిష్ట ఇంజనీరింగ్ సవాళ్లను పరిష్కరించడంలో వినూత్న విధానాన్ని ప్రదర్శించి, ఉత్తమ ఆవిష్కరణ విభాగంలో మూడో బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, విద్యాసంస్థల కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్ డా.కె ,శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు సాధించడం చాలా ఆనందంగా ఉందన తెలిపారు . కార్యక్రమంలో కళాశాల ఏరోనాటికల్ విభాగాధిపతి డా .గుప్తా, డీన్ డా. రాధికా దేవి, సాయికుమార్ తదితరులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నలుగురు..!!

- 110 ఓటర్లు, 81 మంది కార్పొరేటర్లు, 29 ఎక్స్ ఆఫీషియో సభ్యులు
- ఈ నెల 9న నామినేషన్ల ఉపసంహరణ 23న పోలింగ్, 25 కౌంటింగ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. గత నెల 28వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా...ఇప్పటికే ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేయగా..తాజాగా నామినేషన్ చివరి రోజు శుక్రవారం బీజేపీ, ఎంఐఎం పార్టీ తరపున అభ్యర్థులు ఎన్నికల అధికారి అనురాగ్ జయంతిని కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఎంఐఎం పార్టీ నుంచి మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ నుంచి డాక్టన్ ఎన్ గౌతంరావు నామినేషన్ వేశారు. కాగా ఈ నెల 9వ తేదీన నామినేషన్ ఉపసంహరణ, 23న పోలింగ్, 25న కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. హైదరాబాద్ స్థానిక సంస్థల స్థానం పరిధిలో 81 మంది కార్పొరేటర్లు ఉండగా..29 మంది ఎక్స్ ఆఫిషియో సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 15 మంది కార్పొరేటర్లు, 11మంది ఎక్స్ఆఫిషియో సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి మొత్తం 14 మంది సభ్యులు ఉండగా...80శాతంపైగా బీఆర్ఎస్ పార్టీలో గెలిచి పార్టీ మారినవారే ఉన్నారు. వీరిలో ఏడుగురు కార్పొరేటర్లు, ఎక్స్ఆఫిషియో సభ్యుల ఉన్నారు. ఎక్స్ ఆఫిషియో సభ్యుల్లో